పోలీసుల అదుపులో రాజారెడ్డి...?

యల్లనూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఉద్యోగాల పేరిట డబ్బులు వసూలు చేసిన కేసులో నిందితుడు రాజారెడ్డిని పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. పది రోజుల క్రితం రాజారెడ్డిని యల్లనూరు పోలీస్‌స్టేషన్‌లో విచారించి, కేసు నమోదు చేసి వదిలేశారు. దీంతో అతను అజ్ఞాతంలోకి వెళ్లాడు. అరెస్టు చూపకుండా వదిలేయడం పట్ల ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. హైదరాబాద్, విజయవాడ, తిరుపతి, బెంగళూరు తదితర ప్రాంతాల్లో గాలించి, చివరికి కదిరి నుంచి పులివెందులకు వెళుతుండగా అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

వెలుగులు పంచిన దీపావళి


అనంతపురం నగరంలో నరకాసురుడి బొమ్మ దహనం


నగరంలో బాణసంచా వెలుగులు, టపాసులు కాలుస్తున్న ప్రజలు

దీపావళి వేడుకలను జిల్లా ప్రజలు సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఇళ్లు, కార్యాలయాలు, దుకాణాలలో మట్టి ప్రమిదలను వెలిగించి, మహాలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చీకటి పడగానే బాణ సంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. నగరంలోని ఆర్‌ఎస్‌ఎస్ కార్యాలయం వద్ద నరకాసురుడి బొమ్మను దహనం చేశారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం టౌన్


ఆర్‌ఎస్‌ఎస్ కార్యాలయం వద్ద దీపావళి సంబరాలు



సమాజహితం కోసం శ్రమిద్దాం..!

- అమరవీరుల స్ఫూర్తితో అడుగేద్దాం
- డీఐజీ షిమోషి, ఎస్పీ జగదీష్
- కలిసి పనిచేస్తేనే అభివృద్ధి: కలెక్టర్ ఆనంద్
- ఘనంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినం

అనంతపురం క్రైం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): సమాజ హితం, శాంతిభద్రతల పరిరక్షణ కోసం 24 గంటలూ శ్రమిద్దామని, అమరవీరుల స్ఫూర్తితో విధులకు పునరంకితం అవుదామని అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషి పోలీసులకు పిలుపునిచ్చారు. జిల్లా పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లోని పోలీసు అమరవీరుల స్తూపం వద్ద పోలీసు అమరవీరుల సంస్మరణ దినాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా పోలీసులు బలగాలు నుంచి డీఐజీ, కలెక్టర్ ఆనంద్, ఎస్పీ జగదీష్ గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్చాలు ఉంచి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ, దేశ భద్రతలో పోలీసుల పాత్ర కీలకమైనదని అన్నారు. కానిస్టేబుల్ నుంచి ఐపీఎస్ వరకూ ఉద్యోగంలో చేరే ముందు ఒకే తరహా ప్రతిజ్ఞ చేస్తారని గుర్తు చేశారు. ఆ ప్రతిజ్ఞ మేరకు విధులు నిర్వహించాలని సూచించారు. నేర నియంత్రణకు, నేరస్థులకు శిక్ష పడేందుకు అన్ని శాఖలతో కలిసి పోలీసులు పనిచేస్తున్నారని అన్నారు.

కుటుంబ శ్రేయస్సూ ముఖ్యమే: కలెక్టర్ ఆనంద్

సమాజ హితం కోసం ప్రాణాలను లెక్కచేయకుండా, అహర్నిశలు శ్రమించే పోలీసులకు కుటుంబాల శ్రేయస్సు కూడా ముఖ్యమే అని కలెక్టర్ ఆనంద్ అన్నారు. పోలీసు, రెవెన్యూ శాఖ కలసి పని చేస్తే శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజాశ్రేయస్సు, అభివృద్ధి సులభతరం అవుతుందని అన్నారు. పోలీసు అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం తరపున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కారుణ్య నియామకాలను దాదాపుగా పూర్తి చేశామని, పెండింగ్ ఉన్నవాటిని త్వరితగతిన పూర్తి చేస్తామని అన్నారు.

పోలీసుల పాత్ర కీలకం: ఎస్పీ జగదీష్

1959లో అక్టోబరు 21న జరిగిన భీకర యుద్ధంలో లడక్‌లో పది మంది వీర జవానులు అసువులు బాసారని, వారి త్యాగాలకు గుర్తుగా పోలీసు అమరవీరుల వారోత్సవాలను జరుపుకుంటున్నామని ఎస్పీ జగదీష్ గుర్తు చేశారు. ప్రజాస్వామ్యంలో పోలీసుల పాత్ర కీలకమని అన్నారు. తీవ్రవాదం, ఉగ్రవాదం, మత చాందసవాదం, అసాంఘిక శక్తుల నుంచి సామాన్యులకు రక్షణ కల్పించే క్రమంలో పోలీసులు ప్రాణత్యాగం చేస్తూనే ఉన్నారని అన్నారు. అభివృద్ధి జరగాలంటే ప్రశాంతత అవసరమని, దీనికి పోలీసుల సేవలు తప్పనిసరి అని అన్నారు. పోలీసులు సమాజంలో భాగమని, పోలీసులు కుటుంబ సభ్యులుగా భావించాలని ప్రజలను కోరారు. ఏ సాయం వచ్చినా స్వేచ్ఛగా పోలీసుల వద్దకు రావాలని సూచించారు. విధి నిర్వహణలో ప్రాణాలు పణంగా పెట్టిన అమరుల కుటుంబాలకు అండగా ఉంటామని అన్నారు. పోలీసు కుటుంబాలతో సమావేశం నిర్వహించి, శాఖాపరంగా సమస్యలుంటే వెంటనే పరిష్కారం చూపుతామని అన్నారు. ఈ నెల 31వ తేదీ వరకూ పోలీసు అమరవీరుల వారోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. అసాంఘిక శక్తులతో పోరాడి, దేశవ్యాప్తంగా 191 మంది వరకూ పోలీసులు అమరులయ్యారని, వీరిలో మన జిల్లావాసులు సుమారు 10 మంది ఉన్నారని వివరించారు. వారి స్ఫూర్తితో పోలీసులు ధైర్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.


అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న డీఐజీ, కలెక్టర్, ఎస్పీ

15 మందికి కారుణ్య నియామకాలు

పోలీసు కుటుంబాలకు చెందిన 15 మందికి కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు లభించాయి. ఉద్యోగాలు పొందిన గాండ్ల పవన్‌కుమార్, సుజాత, వైష్ణవి, ప్రకాష్, మహమ్మద్ కాసీం, చరణ్ సాయి బాలాజీ, వనిత, సాయి దీపక్‌రెడ్డి, సాయి పవన్, మహబూబ్ బాషా, రాహుల్, అంజలి, సాయి మధుసూదన్ గౌడ్, భానుప్రకాష్, భాను ప్రభాకర్‌కు డీఐజీ షిమోషీ, జిల్లా కలెక్టర్ ఆనంద్, ఎస్పీ జగదీష్ నియామక పత్రాలను అందించారు. అనంతరం అసాంఘిక శక్తుల చేతుల్లో మరణించిన నలుగురు పోలీసుల కుటుంబాలకు, గత ఏడాది వివిధ కారణాలతో మరణించిన ఏడుగురు పోలీసులు, ఆరుగురు హోంగార్డుల కుటుంబాలకు చెక్కుల రూపంలో ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, తాడిపత్రి ఏఎస్పీ రోహిత్ కుమార్, ఏఆర్ అదనపు ఎస్పీ ఇలియాజ్ బాషా, డీఎస్పీలు శ్రీనివాస రావు, వెంకటేషులు, రవిబాబు, శ్రీనివాస్, మహబూబ్ బాషా, నీలకంఠేశ్వర్‌రెడ్డి, సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న పోలీసు అమరవీరుల కుటుంబీకులు, పోలీసులు


పోలీసు బలగాల గౌరవ వందనం

వానొచ్చేస్తోంది..!



రానున్న ఐదు రోజుల్లో విస్తారంగా వర్షాలు

బుక్కరాయసముద్రం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రానున్న ఐదు రోజుల్లో ఉమ్మడి జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త నారాయణ స్వామి తెలిపారు. పగటి ఉష్ణోగ్రతలు 30.2-31.2 డిగ్రీల సెల్సియస్, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 22.5-23.5 డిగ్రీల సెల్సియస్ నమోదు అయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. రానున్న ఐదు రోజుల్లో అనంతపురం జిల్లాలో 22న 10.1మి.మీ, 23న 23.2 మి.మీ, 24న 25మి.మీ, 25న మి.మీ 30, 26న20 మి.మీ, వర్షం కురిసే అవకాశం ఉందన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో 22న 22.3మి.మీ, 23న 20.5 మి.మీ, 24న 24.4మి.మీ, 25న 28.3మి.మీ, 26న 11.5మి.మీ, వర్షం కురిసే అవకాశం ఉందన్నారు. వేరుశనగ పంట కోత చేపట్టే రైతులు వాయిదా వేసుకోవాలని సూచించారు.

నవంబరు 7 వరకు శనగ సాగు

ఉమ్మడి జిల్లాలో నవంబరు 7 వరకు శనగ పంట సాగు చేసుకోవచ్చని వాతావరణ శాస్త్రవేత్త నారాయణస్వామి తెలిపారు. రైతులకు సూచించారు. శనగలో అధిక దిగుబడి ఇచ్చే రకాలైన నంద్యాల గ్రామ1267, 776, 857,452, 49, ధీరా47, జాకీ 9218 రకాల విత్తనం సాగు చేసుకోవచ్చని తెలిపారు. ఎకరానికి 30 నుంచి 35 కేజీల విత్తనం వాడుకోవాలన్నారు. విత్తుకునే ముందు విత్తనశుద్ధి చేపట్టాలన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో కందిని మారుకా మచ్చల పురుగు, పచ్చపురుగు ఆశించిందన్నారు. నివారణకు వ్యవసాయాధికారుల (మిగతా 7వ పేజీలో)


కర్ణాటక ప్రాంతంలో వేదవతి హగరి నుంచి జీటీపీకి చేరుతున్న వరదనీరు

31న ఐక్యతా పరుగు: కలెక్టర్


పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్ తదితరులు

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని ఈనెల 31వ తేదీన ఐక్యతా పరుగు నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఆనంద్ తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ ఆయన మంగళవారం ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లా యువతీయువకులు పాల్గొని, విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మై భారత్ ప్రోగ్రాం ఇన్‌చార్జి శ్రీనివాసులు, రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు బిసాటి జీవన్‌కుమార్, జయమారుతి, యోగా మాస్టర్ మహేష్‌బాబు పాల్గొన్నారు.

భూముల గుర్తింపు సర్వే పూర్తి చేయాలి : కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): సోలార్ ప్రాజెక్టు కోసం భూముల గుర్తింపు సర్వే పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో భూ సేకరణపై అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. కంబదూరు మండలంలో 5,276.81 ఎకరాల భూమిని గుర్తించారని, ఇందులో 984.53 ఎకరాల గుర్తింపు సర్వే పెండింగ్ ఉందని, పూర్తి చేయాలని ఆదేశించారు. గుర్తించిన భూములలో సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సర్వే పూర్తి అయిన భూములకు లీజు అగ్రిమెంట్ చేయించాలని, వీలైనంత వరకు రైతులను ఒప్పించి భూ సేకరణ చేయాలని అన్నారు. నెలాఖరులోగా భూముల గుర్తింపు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంతబాబు, కలెక్టరేట్ ఈ సెక్షన్ సూపరింటెండెంట్ రియాజుద్దీన్, సర్వే ఏడీ రూప్లానాయక్, ఏపీఎన్‌జీఈఎల్ డెవలప్‌మెంట్ అధికారి కిషోర్‌రెడ్డి, ఎల్డీఎం నరేష్‌రెడ్డి, కంబదూరు తహసీల్దార్ బాలకిషన్, ఎన్‌టీపీసీ అధికారులు శివకుమార్, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం గుత్తి సోలార్ ప్రాజెక్టుపై గుంతకల్లు ఆర్డీఓ, గుత్తి తహసీల్దార్ తదితరులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. గుత్తి మండలంలో ఏర్పాటు చేసే సోలార్ ప్రాజెక్టుకు భూముల గుర్తింపు సర్వే చేపట్టాలని ఆదేశించారు. గుత్తి మండలంలోని బేతాపల్లి, ఊటకల్లు, ఊబిచర్ల, కరిడికొండ, ధర్మపురం గ్రామాల పరిధిలో 2,535.66 ఎకరాల భూమి గుర్తించాలని సూచించారు. సమావేశంలో ఆర్డీఓ శ్రీనివాస్, గుత్తి తహసీల్దార్ పుణ్యవతి తదితరులు పాల్గొన్నారు.

కొత్త బండి.. కదలదండీ..!


గట్టిగా ప్రయత్నిద్దాం.. స్టార్ట్ అవుతుందేమో..


ఇంక అయ్యే పని కాదు..! పద స్టేషన్‌లోకి..

బండి కొత్తదే..! కానీ మొండికేస్తుంది. ఎక్కడబడితే అక్కడ ఆగిపోతుంది. పోలీసులను మోసుకుపోవాల్సిన బైకులను వారే తోసుకుపోవాల్సి వస్తోంది. ఇటీవల డిపార్ట్‌మెంట్ ఇచ్చిన కొత్త బైక్‌పై అనంతపురం టూటౌన్ పోలీస్ నుంచి ఓ కానిస్టేబుల్ సోమవారం విధులకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. స్టార్ట్ చెయ్యబోతే మొరాయించింది. దీంతో స్టేషన్ నుంచి రోడ్డుపైకి తోసుకువచ్చారు. 'సార్వజనీన పద్ధతి'లో పలు మార్లు దొబ్బుకుంటూ వెళ్లి స్టార్ట్ చేయాలని ప్రయత్నించారు. అలా దిగువప్రాంతం వైపు తోసి తోసి అలసిపోయి.. పోరాట విరమణ చేశారు. ఆపసోపాలు పడుతూ తిరిగి స్టేషన్‌లోకి చేర్చారు. జీపీఎస్, సైరన్, నైట్ విజన్ లైట్స్, ట్రాఫిక్ క్లియర్ చేసేలా మైక్ వంటి అధునాతన హంగులున్న ఈ ద్విచక్ర వాహనాలు ఇటీవల జిల్లాకు వచ్చాయి. జిల్లా పోలీస్ శాఖ స్టేషన్లకు అందించింది. వాహనాలు కొత్తవే అయినా, పాతవాటిలా మొరాయిస్తున్నాయని సిబ్బంది వాపోతున్నారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం క్రైం

టర్బైన్ మరమ్మతు పూర్తి

నేటి నుంచి తిరిగి విద్యుత్ ఉత్పత్తి


జెన్‌కో అధికారులతో చర్చిస్తున్న డీఈ వెంకటరమణ

కూడేరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పీఏబీఆర్‌లోని జల విద్యుత్ కేంద్రంలో కరెంటు తయారు చేయడానికి టర్బైన్ సిద్ధం చేశారు. టర్బైన్‌లో సమస్య తలెత్తడంతో గత పది రోజులుగా విద్యుదుత్పత్తి నిలిపేశారు. నిపుణుల ఆధ్వర్యంలో టర్బైన్ మరమ్మతు దాదాపు పూర్తి అయిందని అధికారులు చెబుతున్నారు. పీఏబీఆర్ డ్యాం డీఈ వెంకటరమణ, ఏఈఈ లక్ష్మీదేవి మంగళవారం జల విద్యుత్ కేంద్రం లోని అధికారులతో చర్చించారు. బుధవారం ఉత్పత్తి ప్రారంభిస్తామని జెన్‌-కో అధికారులు చెప్పారని డీఈ తెలియజేశారు. ప్రస్తుతం డ్యాంలో 5.386 టీఎంసీలు నీరు ఉందని తెలిపారు. జల విద్యుత్ నిలిచి పోవడంతో హంద్రీ-నీవా, తుంగభద్ర డ్యాంల నుంచి ఇన్‌ఫ్లో పూర్తిగా నిలిపివేశారు. డ్యాంలో నీటి మట్టం రోజురోజుకు పెరిగి పోతుండటంతో గేట్ల నుంచి నీరు లీకేజీ అయ్యి వృథాగా బయటకు వెళ్తుండటంతో ఇన్‌ఫ్లో నిలిపివేశారు. జలవిద్యుత్ ప్రారంభం అయిన వెంటనే ఇన్‌ఫ్లో తిరిగి వస్తుందని ఇరిగేషన్ డీఈ వెల్లడించారు.

రక్తమోడిన రోడ్లు

- పండగ పూట ప్రమాదాలు
- ఆరుగురు మృతి
- తొమ్మిది మందికి గాయాలు
- బాధిత కుటుంబాల్లో విషాదం

7


గార్లదిన్నె వద్ద ఆర్టీసీ బస్సు కిందకు దూసుకుపోయిన కారు

కాటేసిన కరెంటు

వేర్వేరుచోట్ల విద్యుదాఘాతంతో ఇద్దరు మృతి



ఫకీర్దీన్ మృతదేహం

రాప్తాడు/గుంతకల్లుటౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వేర్వేరుచోట్ల ఇద్దరు విద్యుదాఘాతంతో మరణించారు. రాప్తాడు పరిధిలోని ఆటో నగర్‌లో వెల్డింగ్ కార్మికుడు షేక్ ఫకృద్దీన్ (55) కరెంటు కాటుకు బలయ్యాడు. రాప్తాడు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనంతపురం నగరంలోని ఆజాద్‌నగర్‌కు చెందిన ఫకృద్దీన్ వెల్డింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఎక్కడ వెల్డింగ్ పని ఉంటే అక్కడికి వెళ్లి చేసేవాడు. ఆటోనగర్‌లో ఆటో మెబైల్ మెకానిక్ షాపుపైన రేకుల షెడ్డు వేయడానికి కూలీ మాట్లాడుకుని షేక్ ఫకృద్దీన్‌తోపాటు మరో వ్యక్తి జాఫర్ మంగళవారం వెళ్లాడు. ఆటో నగర్‌లో ఆటోమెబైల్ మెకానిక్ షాపు పైన డ్రిల్లింగ్ మిషన్‌తో రంధ్రాలు వేస్తుండగా.. విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఫకృద్దీన్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. అతడి భార్య షాహిమా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రాప్తాడు పోలీసులు తెలిపారు.

గుంతకల్లులో యువకుడు..



షేక్షావలి మృతదేహం

పట్టణంలోని పోర్టర్‌లైన్‌లో నివాసముంటున్న షేక్ షేక్షావలి (26) మంగళవారం విద్యుదాఘాతంతో మృతిచెందాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పోర్టర్ లైన్‌లో నివాసముంటున్న షేక్ ఖాజా వలి, హుసేన్ బీ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఖాజావలి, పెద్ద కుమారుడు షేక్షావలి బేల్దారి పనులకు వెళ్తుండేవారు. అందులో భాగంగా మంగళవారం తండ్రీకొడుకు పోర్టర్ లైన్‌లోనే రేకులు వేసే పనిచేస్తుండగా షేక్షావలికి కరెంట్ షాక్ తగిలి, పైనుంచి జారిపడ్డాడు. షేక్షావలి తల, చేతికి గాయాలయ్యాయి. అతడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతడు అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. షేక్షావలికి ఫరీదాతో రెండేళ్ల క్రితం వివాహమైంది. పిల్లలు లేరు. ప్రమాదంపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

భూమాయపై విచారణ

ఉరవకొండ, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): బోగస్ పత్రాలు సృష్టించి, కోట్ల రూపాయల విలువ చేసే భూమిని కాజేసే యత్నంపై రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. వజ్రకరూరు తహసీల్దార్ నరేష్ మంగళవారం మీసేవ కేంద్రం నిర్వాహకుడు శ్రీనాథ్ గౌడ్‌ను తన కార్యాలయానికి పిలిపించుకుని, విచారణ నిర్వహించారు. మీసేవకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. గతంలో పనిచేసిన డీటీ వాట్సాప్‌కు పంపడంతో మ్యుటేషన్‌కు దరఖాస్తు చేశానని నిర్వాహకుడు తెలిపాడు. భూమికి, రైతుకు సంబంధం లేనపుడు ఎలా చేస్తారని మీసేవ నిర్వాహకుడిని తహసీల్దార్ ప్రశ్నించారు. ఈ ఘటనపై నివేదికను ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

వివాదాల డీటీ..!

శ్రీసత్యసాయి జిల్లాలో పనిచేస్తున్న డిప్యూటీ తహసీల్దార్ (డీటీ) ఆది నుంచీ వివాదాస్పదమే. వైసీపీ పాలనలో ఫోర్జరీ సంతకాలతో రూ.కోట్ల విలువచేసే భూమికి, నకిలీ ఎన్‌వోసీలు జారీచేసిన ఘటనల్లో నిందితుడిగా ఉన్నానరు. తాజాగా బోగస్ పత్రాలు సృష్టించి, మీసేవ కేంద్రం ద్వారా రూ.52 కోట్ల విలువైన భూమిని కాజేయాలని డీటీ కుట్ర పన్నినట్లు వెలుగులోకి వచ్చింది. అనంతపురం రూరల్ మండలంలోని ఉప్పరపల్లిలో పసులూరి రమేష్‌తోపాటు, అతడి తమ్ముళ్లు, అక్కాచెల్లెళ్లకు 13.18 ఎకరాలు వచ్చింది. ఆ భూమిని కాజేయడానికి తాడిపత్రికి చెందిన పసులూరి అనే ఇంటి పేరుతో ఉన్న రుషింగమయ్య అనే వ్యక్తి పేరుతో మీసేవ కేంద్రం నుంచి మ్యుటేషన్‌కు దరఖాస్తు చేశారు. ఈ విషయం భూ యజమానులకు సెల్‌ఫోన్ ద్వారా సమాచారం వెళ్లడంతో అప్రమత్తమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై అనంతపురం రూరల్ తహసీల్దార్.. బాధిత రైతులను పిలిపించి, విచారించారు. బోగస్ పత్రాలు సృష్టించి, భూమిని కాజేయాలని ప్రయత్నించిన అధికారి, మీసేవ నిర్వాహకుడిపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. అందులో భాగంగా తహసీల్దార్ విచారణ చేపట్టారు.

ప్లేస్‌మెంట్ ఉత్తర్వులు జారీ

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శుల ఉద్యోగోన్నతి ప్లేస్‌మెంట్ ఉత్తర్వులు జిల్లా పంచాయతీ కార్యాలయం నుంచి మంగళవారం జారీ అయ్యాయి. గ్రేడ్-5 కార్యదర్శులకు గ్రేడ్-4 కార్యదర్శులుగా ఉద్యోగోన్నతి కల్పించారు. రెండు వారాల క్రితం కౌన్సెలింగ్ నిర్వహించి, ఆప్షన్ ఫామ్స్ స్వీకరించారు. కానీ ఉత్తర్వులు ఇవ్వడంలో జాప్యం జరిగింది. కలెక్టర్ ఆనంద్ ఆదేశాల మేరకు డీపీఓ నాగరాజనాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఉద్యోగోన్నతి పొందిన 150 మంది హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థిని అదృశ్యం



పి. అక్షిత

రాప్తాడు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పంగల్ రోడ్డు సమీపంలోని విన్సెంట్ డీపాల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థిని పి.అక్షిత అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు రాప్తాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పంగల్ రోడ్డులో నివాసం ఉంటున్న శివప్రసాద్ కూతురు అక్షిత 7వ తరగతి చదువుతోంది. మంగళవారం ఉదయం పాఠశాలకు వెళ్లి, సాయంత్రం ఇంటికి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు పాఠశాలలో వెతికినా కనబడలేదు. అక్షిత బ్లూ అండ్ వైట్ చెక్స్ టాప్, బ్లూ కలర్ ప్యాంట్ వేసుకుందని, ఆచూకీ తెలిసిన 9440796817 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సీఐ శ్రీహర్ష కోరారు.

వెండి చైను కోసమే హత్య

హత్య చేసింది మైనర్లు... సహకరించింది మేజర్లు

హత్యకేసు వివరాలు వెల్లడించిన డీఎస్పీ



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

హిందూపురం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మెడలోని వెండిచైను, బైక్ కోసమే వ్యక్తిని హత్య చేశారని డీఎస్పీ మహేష్ పేర్కొన్నారు. అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ వద్ద హత్య కేసు వివరాలను డీఎస్పీ విలేకరులకు మంగళవారం వెల్లడించారు. ఈనెల 12న హిందూపురం మండలం సంతేబిదునూరు వద్ద కర్ణాటక రాష్ట్రం గౌరీబిదనూరుకు చెందిన యువకుడు పవన్‌కుమార్‌ను హత్యచేసి ఆపై మొహంపై పెట్రోల్ పోసి ప్లాస్టిక్ బాటిల్ వేసి కాల్చారు. అయితే మరుసటి రోజు అటుగా వెళ్లేవారు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులను గుర్తించారు. వీరిని మంగళవారం అనుమేపల్లి సమీపంలో ఉన్న హంద్రీనీవా కాలువ వద్ద అరెస్ట్ చేశారు. విచారణలో హత్యచేసింది అనుమేపల్లికి చెందిన ఇద్దరు మైనర్లని తెలిసింది. సంతేబిదునూరు సమీపంలో ఉన్న కల్లుదుకాణం వద్దకు గౌరీబిదనూరుకు చెందిన పవన్‌కుమార్ తరచూ వచ్చి వెళ్లే వాడు. అతడి వద్ద డబ్బులున్నాయని మైనర్లు భావించారు. దీంతో ఎలాగైనా ఆ డబ్బు లాక్కోవాలని ప్లాన్ వేశారు. ఆన్‌లైన్‌లో ఇనుప సేఫ్టీరాడ్‌ను తెప్పించారు. అనుకున్న ప్లాన్ ప్రకారం ఈనెల 12న పవన్‌కుమార్‌ను కల్లుతాగుదామని నమ్మించి కొంతదూరానికి తీసుకెళ్లి అతడి వద్ద వెండి చైను, రూ.2500 లాక్కున్నారు. ఆయన తిరగబడటంతో ఐరన్‌రాడ్‌తో తలపై కొట్టి, అక్కడే ఉన్న బీరుబాటిల్‌తో కడుపులో పొడిచి చంపారు. ఆ తరువాత వారి స్నేహితులైన పి. అంజనేయులు అలియాస్ అంజి, అలియాస్ కుంటిపిచ్చి, సంతేబిదునూరులో నివాసమున్న కర్ణాటక వాసి ఆకాష్ అలియాస్ శెనక్కాయలు సలహా తీసుకుని పవన్‌కుమార్ మృతదేహంపై ప్లాస్టిక్ బాటిళ్లు, కట్టెలువేసి పెట్రోల్‌పోసి నిప్పంటించారు. హత్యకేసును త్వరగా ఛేదించిన సీఐ ఆంజనేయులు, సీఐ జనార్దన్, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. విలేకరుల సమావేశంలో సీఐలు రాజగోపాల్‌నాయుడు, అంజనేయులు, జనార్దన్, అబ్దుల్ కరీం ఉన్నారు.

వానొచ్చేస్తోంది..!



ముత్యాల చెరువు నుంచి వస్తున్న వరద నీరు



తిమ్మాపురం వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వరదనీరు



మణూరు గ్రామం వద్ద ప్రవహిస్తున్న వంక

(5వ పేజీ తరువాయి)

సలహా మేరకు రసాయన, పురుగు మందులు వాడుకోవాలన్నారు.

పలు ప్రాంతాల్లో వర్షం

అనంతపురం అర్బన్: జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం వర్షం కురిసింది. అనంతపురం, బెళుగుప్ప, గుత్తి, విడపనకల్లు, గార్లదిన్నె, శెట్టూరు, నార్పల, పామిడి మండలాల్లో ఓ మోస్తరు వర్షం పడింది. కూడేరు, రాయదుర్గం, గుంతకల్లు తదితర మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి.

ముత్యాలచెరువుకు మరువ

పెనుకొండరూరల్: పెనుకొండ మండలంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. పలు గ్రామాల్లో సాగుచేసిన పంటలు నీట మునిగాయి. ముత్యాల చెరువుకు భారీగా వరద నీరురావడంతో మరువ ఉధృతంగా ప్రవహించి మరువనీరు పాత జాతీయ రహదారిపై ప్రవహించాయి. పెనుకొండ నుంచి కియ వైపు వెళ్లే వాహనాలకు స్వల్ప అంతరాయం ఏర్పడింది.

పొంగిపొర్లిన వాగులు, వంకలు

మడకశిర రూరల్: మడకశిర ప్రాంతంలో సోమవారం రాత్రి భారీగా వర్షం కురిసింది. మడకశిర మండలంలో 56.8 మిల్లీ మీటర్లు, అగళి 58.6 మి.మీ, రొళ్ల 50.4మి.మీ, గుండిబండ 14.10 మి.మీ, అమరాపురం 10 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. మడకశిర మండల వ్యాప్తంగా వంకలు, వాగులు పొంగిపొర్లాయి. చెక్ డ్యాంలు, కుంటలు నిండాయి. కోతకు వచ్చిన రాగి, మిరప పొలాల్లోకి నీరు చేరడంతో పంట కోతకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హరేసముద్రం, చందకచర్ల, మణూరు గౌడనహళ్లి పంచాయతీ పరిధిలో వాగులు ఉధృతంగా ప్రవహించాయి.

బీటీపీకి ఇన్‌ఫ్లో

గుమ్మఘట్ట: మండలంలోని భైరవానితిప్ప ప్రాజెక్టుకు వరదనీటి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. కర్ణాటక ప్రాంతాల్లో గత రెండురోజులుగా భారీ వర్షాలు కురవడంతో వాణి విలాసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండి మరువపారుతోంది. దీంతో వేదవతి నదికి, ఆపై బీటీపీ ప్రాజెక్టుకు రెండువేల క్యూసెక్కుల వరదనీరు చేరుతోంది. ప్రస్తుతం బీటీపీలో 1655 అడుగులకు నీరు చేరినట్లు అధికారులు పేర్కొన్నారు. వరదనీటి ప్రవాహం వేదవతి హగరిలో మరో నెలరోజుల పాటు కొనసాగే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. బీటీపీకి పూర్తిస్థాయి నీరు చేరితే కుడికాలువ కింద 16 వేల ఎకరాలు, ఎడమ కాలువ కింద మూడు వేల ఎకరాలు సాగయ్యే అవకాశం ఉంది.

ఆదుకుంటామని మోసం

మోసగాళ్ల వలలో ఓ యువకుడు

నల్లచెరువు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు ఓ ఫౌండేషన్ పేరుతో మోసం చేసి డబ్బు కాజేసిన ఘటన మండలంలోని గొల్లపల్లి గ్రామంలో జరిగింది. వివరాలు ఇలా... గొల్లపల్లి గ్రామానికి చెందిన యువకుడు కె.బయప్ప ఇన్‌స్టాగ్రామ్‌లో హర్షసాయి ఫౌండేష్ పేరు మీద ప్రకటన చూసి వారి కుటుంబంలోని నానమ్మ అనారోగ్యానికి గురికావడంతో ఆర్థిక సాయం కోసం ఆ ఫౌండేషన్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో మెసేజ్ రూపంలో అభ్యర్థించారు. దీన్ని అసరాగా తీసుకున్న కొందరు సైబర్ నేరగాళ్లు ఫౌండేషన్‌కు ఫీజు చెల్లిస్తే రూ. 3.5 లక్షలు మీ అకౌంట్‌కు వేస్తామని నమ్మబలికారు. మొదటగా రూ.2వేలు వేసిన తరువాత ఫౌండేషన్ నిర్వాహకులు రూ. 2వేలు కాకుండా బాధితుడిని అకౌంట్‌లో రూ. 50 వేల రూపాయలు ఉంటే అమౌంట్ క్రెడిట్ అవుతుందని నమ్మబలికారు. అలా నమ్మబలికి తరవాత అకౌంట్‌లో ఉన్న రూ. 50వేలు కూడా ట్రాన్సర్ చేస్తే రూ.3.50 మీ అకౌంట్‌లో వేస్తామన్నారు. అలా నాలుగురోజుల వ్యవధిలో రూ. 1.85లక్షలు ఫౌండేషన్ అకౌంట్‌కి ట్రాన్సర్ చేయించుకున్నారు. డబ్బుల కోసం బాధితుడు నిలదీయడంతో బెంగళూరు శివారు యలహంక దగ్గరకు రమ్మన్నారు. ఆమేరకు బయప్ప యలహంకకు వెళ్లి వారికి ఫోన్ చేయగా గంటలో వస్తామని చెప్పి సాయంత్రం కూడా రాలేదు. దీంతో బాధితుడు అక్కడే ఉన్న తన స్నేహితుల సాయంతో కర్ణాటకలోని యలహంక సైబర్ క్రైమ్‌వారికి ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు సైబర్‌క్రైమ్ వారు ఫౌండేషన్ వారి అకౌంట్ హోల్డ్‌లో ఉంచామని, మీ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఒకసారి వెళ్లి కలవమన్నారు. ఈ విషయంపై ఎస్సై మక్బుల్ బాషాను వివరణ కోరాగా జరిగిన సంఘటన వాస్తవమేననీ, ఎవరూ కూడా అత్యాశకు పోయి సోషల్‌మీడియాలో ఫౌండేషన్ మీద వచ్చే ఇలాంటి వాటిని నమ్మవద్దన్నారు. ఈ సంఘటనను విచారిస్తామని బాధితుడుకి తెలిపారు.

కల్లితండాలో అమరవీరుల దినం



మురళీనాయక్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న పోలీసులు, కుటుంబీకులు

హిందూపురం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కల్లితండాలో పోలీసు అమరవీరుల దినాన్ని నిర్వహించారు. గోరంట్ల సీఐ శేఖర్, ఎస్‌ఐ రామచంద్ర, ఉమాదేవి, సిబ్బంది తదితరులు ఆపరేషన్ సిందూర్‌లో అమరుడైన వీరజవాన్ మురళీనాయక్ సమాధివద్ద పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సీఐ శేఖర్ మాట్లాడుతూ దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వీరజవాన్ మురళీనాయక్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీరజవాన్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రెవెన్యూ క్రీడలకు ఏర్పాట్లు చేయండి

కలెక్టర్లు ఆనంద్, శ్యాంప్రసాద్

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నవంబరు 7, 8, 9తేదీల్లో నిర్వహించే 7వ రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాలు-2025కు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్‌తో కలిసి సమన్వయ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడలు నగరంలోని ఆర్డీటీ స్టేడియంలో జరుగుతాయని తెలిపారు. క్రీడలలో పాల్గొనేవారికి వసతి, భోజనం, ఇతర ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఏ ఏ జిల్లాల నుంచి ఎవరెవరు వస్తారో ముందుగానే తెలుసుకోవాలని సూచించారు. డయాస్, ప్రొటోకాల్ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఉమ్మడి జిల్లాల అధికారులు సమన్వయం చేసుకుని పనిచేయాలని సూచించారు. సమష్టి కృషితో క్రీడలను విజయవంతం చేయాలని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ సూచించారు. రెవెన్యూ క్రీడల్లో పాల్గొనేందుకు వచ్చే ఉద్యోగులకు సాధ్యమైనంతవరకూ రాయలసీమ వంటలను వడ్డించాలని సూచించారు. వసతి నుంచి క్రీడలు జరిగే ఆర్డీటీ స్టేడియానికి రవాణా సౌకర్యం ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి రామకృష్ణారెడ్డి, ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతనాయుడు, శ్రీనివాస్, మహేష్, వీవీఎస్ శర్మ, సువర్ణ, ఆనంద్ కుమార్, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దివాకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రక్తమోడిన రోడ్లు

పండగ పూట ప్రమాదాలు

ఆరుగురు మృతి.. తొమ్మిది మందికి గాయాలు


బాధిత కుటుంబాల్లో విషాదం

రామగిరి/ఓబుళదేవరచెరువు/హిందూపురం/ముదిగుబ్బ/గార్లదిన్నె, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రోడ్లు రక్తమోడాయి. పండగపూట వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు మరణించగా.. తొమ్మిది మంది గాయపడ్డారు. ఆయా కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. వారి కుటుంబీకులు, బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు.

దైవదర్శనానికి వెళ్లొస్తూ..



చంద్రశేఖర్(ఫైల్)



రామలింగ (ఫైల్)

రామగిరి మండలం పేరూరు సమీపాన మంగళవారం బైక్‌ను ట్రాక్టర్ ట్రాలీ తగలడంతో పెండ్లిజీవి కురుబ చంద్రశేఖర్ (57), కురుబ మల్లెల రామలింగ (54) మృతిచెందారు. కనగానపల్లి మండలం వేపకుంట గ్రామానికి చెందిన వీరు టీడీపీ సానుభూతిపరులు, బంధువులు కూడా. దీపావళి పండుగ సందర్భంగా రామగిరి మండలంలోని పాపిరెడ్డిపల్లి సమీపాన గల అక్కమ్మగార్ల దర్శనానికి వచ్చారు. దైవదర్శనం చేసుకుని తిరిగి స్వగ్రామానికి బైక్‌లో బయల్దేరారు. పేరూరు సమీపంలో వెళ్తుండగా.. వెనుక నుంచి ట్రాక్టర్ ఓవర్ టేక్ చేయబోయి ట్రాలీ తగిలింది. దీంతో బైక్‌లోని ఇద్దరు ట్రాలీ టైర్ల కిందపడ్డారు. ఆ ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. చంద్రశేఖర్‌కు ఇద్దరు కుమారులు మారుతి, సుబ్రహ్మణ్యం ఉన్నారు. రామలింగకు భార్య వసంతమ్మ, కుమారులు సోము, సాంబ ఉన్నారు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ సుధాకర్ యాదవ్ తెలిపారు.


కూతురిని చూసి వస్తూ..



సాలెమ్మ (ఫైల్)

పండుగ రోజు కుమార్తెను పలకరించి వెనుదిరిగి వస్తున్న వృద్ధురాలిని రోడ్డు ప్రమాదం కబళించింది. ఓబుళదేవరచెరువు సమీపంలోని రెయిన్ బో పాఠశాల వద్ద సోమవారం బైక్‌ను వెనుక నుంచి మరో ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో దాదిరెడ్డి సాలెమ్మ (80) మృతి చెందింది. ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని దాదిరెడ్డిపల్లిలో సాలెమ్మ నివాసం ఉండేవారు. మండలంలోని నారప్పగారిపల్లిలో ఉంటున్న కుమార్తె లక్ష్మీనరసమ్మ వద్దకు పండుగ రోజు వెళ్లింది. కుమార్తెను పలకించి అల్లుడు శ్రీనివాసులుతో కలిసి ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి బయల్దేరింది. రైయిన్‌బో పాఠశాల వద్ద సాలెమ్మ వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి మరో బైక్‌పై వస్తున్న గణేష్ ఢీకొట్టాడు. ప్రమాదంలో సాలెమ్మ, ఆమె అల్లుడు గాయపడ్డారు. సాలెమ్మను 108 వాహనంలో కదిరికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. ఆమెకు ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.


అమ్మ వద్దకెళ్తూ.. చిన్నారి..



మెహతాజ్ (ఫైల్)

పుట్టింట్లో ఉన్న అమ్మను చూడడానికి బయల్దేరిన చిన్నారిని రోడ్డు ప్రమాదం బలిగొంది. గోరంట్ల మండలం మల్లాపల్లి వద్ద సోమవారం ద్విచక్రవాహనాన్ని ఆటో ఢీకొన్న ప్రమాదంలో మెహతాజ్ (11) అనే చిన్నారి మృతిచెందగా.. నలుగురు గాయపడ్డారు. గోరంట్ల సీఐ శేఖర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గోరంట్లకు చెందిన ఖలందర్ భార్య ఆయిషా సొంత ఊరైన పెనుకొండకు వెళ్లింది. తామే వస్తామని ఆయిషా చెప్పినా వినకుండా.. ఖలందర్ కుమార్తె మెహతాజ్‌తో కలిసి తన ఆటోలో పెనుకొండకు బయల్దేరాడు. దారిలో ప్యాసింజర్లను కూడా ఎక్కించుకున్నాడు. మల్లాపల్లి సమీపాన ద్విచక్రవాహనాన్ని ఢీకొని ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో మెహతాజ్‌తోపాటు పాలసముద్రానికి చెందిన రామక్క, వెంకటేశ్, శాంతమ్మ గాయపడ్డారు. ద్విచక్రవాహనంలో వెళ్తున్న చిలమత్తూరు మండలం బండ్లపల్లికి చెందిన గంగిరెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన చిన్నారి మెహతాజ్‌ను బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. కుమార్తె మృతితో తీవ్ర ఆవేదన చెందిన ఖలందర్ సోమవారం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. సోషల్ మీడియా ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేయగా.. కదిరిలో ఉన్న ఖలందర్‌ను గుర్తించి మంగళవారం ఉదయం గోరంట్లకు తీసుకొచ్చారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నట్లు గోరంట్ల సీఐ శేఖర్ తెలిపారు.

బైక్‌ను ఎక్స్‌కవేటర్ ఢీకొని ఇద్దరు..



చెన్నకృష్ణ (ఫైల్)



శేషయ్య (ఫైల్)

ముదిగుబ్బ మండలం గుంజేపల్లి చెరువుకట్ట సమీంలో సోమవారం రాత్రి బైక్‌ను ఎక్స్‌కవేటర్ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా.. ఒకరు గాయపడ్డారు. ముదిగుబ్బ సీఐ శివరాముడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బుక్కపట్నం మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన శేషయ్య(59), చెన్నకృష్ణ(55), మోహన్ ద్విచక్రవాహనంలో ముదిగుబ్బకు వచ్చి తిరిగి స్వగ్రామానికి బయల్దేరారు. గుంజేపల్లి చెరువు కట్ట వద్ద ఎదురుగా వస్తున్న ఎక్స్‌కవేటర్ ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన చెన్నకృష్ణ, శేషయ్య అక్కడికక్కడే మృతిచెందారు. మోహన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. చెన్నకృష్ణకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. స్వగ్రామంలో వ్యవసాయ పరికరాలు బాడుగకు ఇచ్చుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. శేషయ్యకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. స్వగ్రామంలో వేరుశనగ కాయల వ్యాపారం చేస్తుండేవాడు. మోహన్‌ను బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శివరాముడు తెలిపారు. ఇద్దరి మృతితో కృష్ణాపురం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన కారు



ఆర్టీసీ బస్సు కిందకు దూసుకుపోయిన కారు

గార్లదిన్నె మండలం కనుంపల్లి వద్ద 44వ జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న గుత్తి డిపోకి చెందిన ఆర్టీసీ బస్సును వెనుక నుంచి కారు ఢీకొట్టడంతో ముగ్గురు గాయపడ్డారు. బస్సు వెనుక భాగంలోకి కారు దూసుకెళ్లి ఇరుక్కుపోయింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఉదయ్ వర్మ స్వల్పంగా గాయపడ్డాడు. వృద్ధుడు, మహిళ తీవ్రంగా గాయపడ్డారు. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు కారులో ముగ్గురు బయల్దేరారు. కనుంపల్లి బస్సును ఢీకొట్టడంతో ముగ్గురూ గాయపడ్డారు. సమాచారం తెలుసుకున్న శింగనమల సీఐ కౌలుట్లయ్య, ఎస్‌ఐ మహమ్మద్ గౌస్‌బాషా ప్రమాద స్థలానికి చేరుకున్నారు. కారులో ఇరుక్కుపోయిన ముగ్గురిని బయటకు తీశారు. వారిని ఆస్పత్రికి తరలించేందుకు 108 వాహనం రావడం ఆలస్యం కావడంతో రహదారిపై వెళ్తున్న వాహనాల్లో క్షతగాత్రులను ఎస్‌ఐ మహమ్మద్‌గౌస్ బాషా తరలించారు.

ఎన్‌టీఏ కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గాన్ని సత్కరిస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు

అనంతపురం విద్య, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): నోబుల్ టీచర్స్ అసోసియేషన్ కార్యవర్గాన్ని రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో ఎన్‌జీఓ హోమ్‌లో సోమవారం ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర నాయకుడు శివశంకర్ వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడిగా పతకమూరి శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎస్.రవి, జిల్లా కోశాధికారిగా ఎం.వెంకటేశులు, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శిగా వరలక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రేపు సాఫ్ట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాస్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈ నెల 23వ తేదీన ఆర్డీటీ స్టేడియంలో నిర్వహిస్తామని జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గాయత్రి, గంగమ్మ తెలిపారు. సీనియర్ పురుషులు, మహిళల విభాగంలో ఎంపిక పోటీలు ఉంటాయని, ఎంపికైన క్రీడాకారులు నవంబరు 8, 9 తేదీలలో గుంటూరు జిల్లా పిడుగురాళ్లలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. వివరాలకు 7989017210 నంబరులో సంప్రదించవచ్చని తెలిపారు.

నాటు తుపాకీ స్వాధీనం

బుక్కపట్నం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): బుక్కపట్నం మండలం కొత్తకోట గ్రామానికి చెందిన ఇద్దరు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి నాటు తుపాకీని స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. వీరు గూనిపల్లి అటవీ ప్రాంతం, గుట్టల్లో సంచరిస్తుండగా పట్టుకున్నట్లు సమాచారం. వీరిని పుట్టపర్తిలోని జిల్లా పోలీసు కార్యాలయానికి తరలించి, విచారిస్తున్నట్లు తెలిసింది. ఈ విషయం తమ దృష్టికి రాలేదని ఎస్‌ఐ కృష్ణమూర్తి తెలిపారు.

న్యూస్ బాక్స్

ప్రిన్సిపాల్‌ను తొలగించాలి



రిజిస్ట్రార్‌కు వినతి పత్రం ఇస్తున్న ఏఐఎస్‌ఏ నాయకులు

అనంతపురంరూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌ను విధుల నుంచి తొలగించాలని ఏఐఎస్‌ఏ జాతీయ కార్యవర్గ సభ్యుడు వేమన డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వర్సిటీ రిజిస్ట్రార్ రమేష్‌బాబును కలసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ కళాశాలలో అక్రమాలు జరుగుతున్నాయని అన్నారు. విద్యార్థుల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ప్రిన్సిపాల్ ప్రవర్తన కారణంగా విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. కార్యక్రమంలో ఐసా నాయకుడు బీమేష్ పాల్గొన్నారు.

ఏడీసీసీబీ చైర్మన్‌కు సన్మానం



ముంటిమడుగు కేశవరెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న నాయకులు

గార్లదిన్నె, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఏడీసీసీబీ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డిని మంగళవారం అనంతపురంలోని ఏడీసీసీ బ్యాంకులో గార్లదిన్నె కూటమి నాయకులు సన్మానించారు. కేశవరెడ్డి జన్మదిన వేడుకలకు అందుబాటులో లేకపోవడంతో ఘనంగా శాలువాలతో సత్కరించారు. అనంతరం ఆయనకు జ్ఞాపికను అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు శేఖర్, ప్రధాన కార్యదర్శి గుర్రం శీనా, నాయకులు రామాంజనేయులు, పవన్, రాకెట్ల శీనా, రాజశేఖర్ ఆచారి, చంద్రశేఖర్‌రెడ్డి, నలపరెడ్డి, గిర్రెడ్డి, హరి, రామాంజి, సుబ్రహ్మణ్యం, కోనప్ప, శీనా, రవి తదితరులు పాల్గొన్నారు.

బాలుడిపై పోక్సో కేసు

శింగనమల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికకు గర్భం రావడానికి కారణమైన ఓ బాలుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఓ గ్రామానికి చెందిన 16 సంవత్సరాల బాలిక ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. అదే గ్రామానికి చెందిన 16 సంవత్సరాల బాలుడు వరుసకు చెల్లి కావడంతో సన్నిహితంగా ఉండేవాడు. బాలిక గర్భం దాల్చడంతో కుటుంబ సభ్యులు ఐసీడీఎస్ సిబ్బంది, పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో కారకుడైన బాలుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు.

ఆటో నగర్‌లో చోరీ

రాప్తాడు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపాన గల ఆటో నగర్‌లో ఆదివారం రాత్రి దొంగలు పడ్డారు. ఆటో నగర్‌లోని పలు షాపుల్లో బంగారు, నగదు, వాహనాల సామగ్రి చోరీ చేశారు. షెక్షావలి షాపులో మూడు తులాల బంగారం, రూ. 10 వేలు నగదు, వాహనాల సామగ్రి, రవి షాపులో 4 ట్రాక్టర్ బ్యాటరీలు, ట్రాక్టర్ సామాన్లు, రోలర్ మెకానిక్ షాపులో మూడు రోడ్డు రోలర్ బ్యాటరీలు అపహరించారు. మూడు షాపుల్లో మొత్తం దాదాపు రూ. 5లక్షలు విలువైన బంగారం, నగదు, సామగ్రి చోరీ చేశారు. బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

టీడీపీ నాయకులకు పరామర్శ

గార్లదిన్నె, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): టీడీపీ అనంతపురం పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి ఇల్లూరు రామాంజనేయులు, మాజీ సర్పంచు సుంకన్నల తల్లి నారాయణమ్మ (95) అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె మంగళవారం అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఏడీసీసీబీ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి రామలింగారెడ్డి, నాయకులు గేటు క్రిష్టారెడ్డి, లాయర్ నాగిరెడ్డి, వన్నూర్, రాము, వెంకటేష్ ఇల్లూరు గ్రామానికి వెళ్లి నారాయణమ్మ మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మండల సమావేశం వాయిదా

ఆత్మకూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఎంపీటీసీలు గైర్హాజరు కావడంతో మంగళవారం నిర్వహించాల్సిన మండల సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేశారు. ఎంపీపీ, వైస్ ఎంపీపీలు కూడా సమావేశానికి హాజరుకాలేదు. ముట్టాల ఎంపీటీసీ పారిజాతమ్మ, మండల అధికారులు హాజరయ్యారు. ఎంపీడీఓ లక్ష్మీనరసింహ ప్రజా ప్రతినిధులుకు సమాచారం ఇచ్చినా వారు హాజరు కాకపోవడంతో ఉదయం వాయిదా వేశారు. అనంతరం మధ్యాహ్నం సమావేశం ఏర్పాటు చేసినా సభ్యులు హాజరు కాకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ ప్రకటించారు.

రేపు మహిళా కబడ్డీ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ అంతర్ కళాశాలల మహిళల కబడ్డీ పోటీలు ఈనెల 23న ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ చైర్‌పర్సన్, ప్రిన్సిపాల్ పద్మశ్రీ తెలిపారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలలో రెగ్యులర్‌గా చదువుతూ 17-25 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన కబడ్డీ క్రీడాకారిణులు అర్హులని తెలిపారు. మరిన్ని వివరాలకు ఆర్ట్స్ కళాశాల పీడీ శ్రీరామ్ సెల్ నంబరు 9493348808 ను సంప్రదించాలని కోరారు.

రఘు సైనిక్ స్కూల్ విద్యార్థుల సత్తా

అనంతపురం విద్య, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): స్కూల్‌గేమ్స్ జిల్లా స్థాయి పోటీలలో రఘు సైనిక్‌స్కూల్ విద్యార్థులు సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారు అండర్-17 బాలికల విభాగంలో అతీబాఆప్నా ప్రథమ స్థానంలో నిలవగా, అండర్-14 బాలుర విభాగంలో పర్వేజ్ రెండోస్థానం, హర్షిత్ నాలుగో స్థానం అండర్-14 బాలికల విభాగంలో హర్షియాఅంజుమ్ 5వ స్థానంలో నిలిచారు.క్రీడా పోటీలలో ప్రతిభ చాటిన విద్యార్థున మంగళవారం స్కూల్ కరస్పాండెంట్లు రఘు, గురు, లోకేష్ కోచ్ మెహరాజ్ అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమానులు

వైభవంగా దీపావళి వేడుకలు



కాశీవిశ్వేశ్వరాలయంలో కేదారేశ్వర వ్రతం, షిర్డీసాయిబాబా ఆలయంలో లక్ష్మీపూజ నిర్వహిస్తున్న భక్తులు



వెంకటాపురంలో చిన్నారులతో కలిసి టపాసులు కాల్చుతున్న ఎమ్మెల్యేపరిటాల సునీత

అనంతపురం టౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే దీపావళి వేడుకలు సోమవారం జిల్లా వ్యాప్తంగా వైభవోపేతంగా జరిగాయి. జిల్లా కేంద్రంతోపాటు ప్రధాన పట్టణాలన్నీ బాణసంచా వెలుగులను విరజిమ్మాయి. దీపావళి పండుగను పురస్కరించుకుని ఆలయాలు సందడిగా కనిపించాయి. ప్రజలు తమ తమ ఇళ్లల్లో ప్రమిదల్లో దీపాలను వెలిగించి ప్రత్యేకంగా అలంకరించారు. వ్యాపార సముదాయాల్లోనూ మహాలక్ష్మి అమ్మవారికి విశేష పూజలు చేశారు. సాయంత్రం చిన్న, పెద్ద తేడాలేకుండా అందరూ ఉత్సాహంగా బాణసంచా కాలుస్తూ పండుగను జరుపుకున్నారు. జిల్లా కేంద్రంలో ని మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో దేవదాయశాఖ ఆధ్వర్యంలో కేదారేశ్వరస్వామి వ్రతాన్ని నిర్వహించారు. ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు, సంబరాలు నిర్వహించారు.

రామగిరి : రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత తమ స్వగ్రామం వెంకటాపురంలో దీపావళి వేడుకల్లో కుటుంబ సభ్యులతో కలిసి ఘనంగా నిర్వహించారు. ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ దంపతులతోపాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. పరిటాల రవి చిత్ర పటం వద్ద దీపాలు వెలిగించి వేడుకలు జరుపుకున్నారు. చిన్నారులతో కలిసి బాణ సంచాలు కాల్చుతూ ఆనందంగా గడిపారు.

శిశుగృహ, అనాథాశ్రమాల్లో..

అనంతపురం క్రైం: ఈ ఏడాది దీపావళి పండుగ వేళ... ఎస్పీ జగదీష్ సరికొత్తగా ఆలోచించారు. కల్మషం లేని పిల్లల నడుమ దీపావళి పండుగ చేసి వారి కళ్లలో ఆనంద కాంతులు చూడాలని పోలీసులను ఆదేశించారు. దీంతో పలు స్టేషన్ల పరిధిలోని సీఐలు, ఇతర పోలీసులు సోమవారం తమ ఇళ్లలో కాకుండా ఈ పిల్లల వద్ద పండుగ చేసుకున్నారు. అనంతపురం 4వ పట్టణ సీఐ జగదీష్, ఇతర పోలీసు సిబ్బంది కొవ్వూరునగర్‌లో ఉన్న క్రీసెంట్ రెయిన్‌బో హోంలో ఉన్న చిన్నారుల మధ్య దీపావళి జరుపుకున్నారు. నాలుగేళ్ల నుంచి ఇంటర్ వరకూ చదివే 80 మంది పిల్లలతో టపాసులు కాల్పించి ఆనందం వ్యక్తం చేశారు. ఒకటో పట్టణ సీఐ వెంకటేశ్వర్లు నగరంలోని శిశుగృహలో చిన్నారుల మధ్య టపాసులు కాల్పిస్తూ...పండుగ సంతోషాన్ని పంచుకున్నారు. ఇతర స్టేషన్లలోని సీఐలు,ఎస్‌లు సైతం దీపావళి సంతోషాన్ని... ఇలా చిన్నారుల నడుమ చేసుకుని ఆనందం పంచారు.



అనంతపురం నాలుగో పట్టణ సీఐ జగదీష్, పోలీసు సిబ్బంది ఆధ్వర్యంలో బాణసంచా పేలుస్తున్న చిన్నారులు

కార్తీకం.. సకల పాపహరణం

నేటి నుంచి కార్తీక మాస పూజలు





అనంతపురం టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆశ్వీయుజ మాసం మంగళవారం నాటికి ముగిసింది. సూర్యమానాన్ని అనుసరించి బుధవారం నుంచి కార్తీక మాసం ప్రారంభం కానుంది. పూర్ణిమ కృత్తికా నక్షత్రంతో కూడి ఉన్నందున ఈ మాసానికి కార్తీకమాసమని పేరు. పరమశివుడు, శ్రీమహావిష్ణువులకు అత్యంత ప్రీతిపాత్రమైనది ఈ మాసం. అందుకే శివాలయాల్లో అభిషేకాలే కాక విష్ణు ప్రీతిగా తులసి పూజలూ ఈ మాసంలో నిర్వహించడం ఆనవాయితీ. కార్తీక మాసంలో తెల్లవారుజామునే లేచి తలారా స్నానం చేసి, శుభ్రమైన దుస్తులు ధరించి, తులసికోట ముందు భగవన్నామ సంకీర్తన చేస్తూ ధూపదీప నైవేద్యాలు సమర్పిస్తారు. ఇలా చేయడం వల్ల మనసంతా ఆధ్యాత్మిక పరిమళాలతో నిండి అలౌకికమైన, అనిర్వచనీయమైన ఆనందం కలుగుతుంది. కార్తీకమాసంలోనే శీతాకాలమూ ఆరంభమవుతుంది. నదీ, సముద్ర జలాల్లో దేహానికి అవసరమైన లవణాలు నిక్షిప్తమై ఉంటాయి. కనుక కార్తీకమాసంలో సూర్యోదయానికి ముందే స్నానాదులు ఆచరిస్తే రోగాలు దరిచేరవని శాస్త్రం చెబుతోంది.

ఆలయాలు ముస్తాబు...

కార్తీకమాస పూజలకు జిల్లా వ్యాప్తంగా గల ఆలయాలన్నీ సిద్ధమయ్యాయి. రోజూ పరమేశ్వరుడికి విశేష పూజలు, అభిషేకాలు, మహన్యాసపూర్వక రుద్రాభిషేకాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా కేంద్రంలో మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయం, ఆరవరోడ్డు సర్వేశ్వరాలయం, హెచ్చెల్సీ కాలనీ మంజునాథస్వామి దేవాలయం, చాముండేశ్వరి దేవాలయం, శారదానగర్‌లోని శృంగేరి శంకరమఠం, శివబాలయోగి ఆశ్రమం, బెంగుళూరురోడ్డులోని శివకోటి దేవాలయం, పాతూరులోని విరూపాక్షేశ్వరాలయం తదితర ఆలయాలు కార్తీక మాస పూజలకు ముస్తాబయ్యాయి.

కార్తీక పూజలతో ఎన్నో ప్రయోజనాలు



కార్తీకమాసంలో ఆచరించే చన్నీటి స్నానంతోపాటు భక్తిప్రపత్తులతో నిర్వహించే పూజాదులవల్ల మానసికంగానే కాక శారీరకంగానూ అనేక ప్రయోజనాలున్నాయి. దేవుడిపై గల భక్తిని మనసునిండా నింపుకుని వేకువజామునే చేసే చన్నీటి స్నానం వల్ల శారీరకోల్లాసం కలుగుతుంది. మానసికంగానూ ఎంతో ధృడంగా ఉండగలం. ఈ మాసంలో చేసే దీపారాధన ఏడాది మొత్తం చేసే దీపారాధనలతో సమానం. ఏడాది మొత్తం చేసే పూజాఫలం ఈ మాసంలో ఒక్కటే లభిస్తుందని పురాణాల సారాంశం.

-నరసింహశాస్త్రి, ప్రధానార్చకుడు, మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వరాలయం

సాయిగణేష్ ఆగ్రో ఏజెన్సీ డీలర్‌కు నోటీసు

అనంతపురం అర్బన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఎరువుల కొనుగోలుకు సంబంధించిన బిల్లు ఇవ్వకుండా తనపై దురుసుగా ప్రవర్తించాడని ఓ రైతు ఫిర్యాదుపై అనంతపురం నగరంలోని శ్రీ సాయిగణేష్ ఆగ్రో ఏజెన్సీ ఎరువుల దుకాణం డీలర్‌కు అనంతపురం ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ మంగళవారం షోకాజు నోటీసు జారీ చేశారు. కూడేరు మండలం కమ్మూరుకు చెందిన రైతు లక్ష్మీనారాయణ అనంతపురం ఆర్టీసీ బస్టాండ్ రోడ్డులోని సాయిగణేష్ ఆగ్రో ఏజెన్సీలో దానిమ్మ పంట కోసం అగ్రోమిన్ మ్యాక్స్ 4 కిలోలు, 19-19-19 ఎరువులు 3 కిలోలు కొనుగోలు చేశాడని ఏడీఏ తెలిపారు. అందుకు సంబంధించి రూ.2,400 ఫోన్‌పే ద్వారా చెల్లించాడన్నారు. ఎరువుల కొనుగోలుకు సంబంధించిన బిల్లును డీలర్ ఇవ్వకుండా దురుసుగా ప్రవర్తించాడని, తనకు విక్రయించిన ఎరువుల నాణ్యతను పరీక్షించాలని కలెక్టర్ ఆనంద్‌కు బాధిత రైతు ఫిర్యాదు చేశాడన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎరువుల కొనుగోలు చేసిన రైతుకు బిల్లు ఎందుకు ఇవ్వలేదన్న అంశంపై డీలర్‌కు షోకాజు నోటీసు జారీ చేశామని వివరించారు. మూడు రోజుల్లోగా నోటీసుకు వివరణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. అనంతపురం డివిజన్ పరిధిలోని ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల డీలర్లు తప్పని సరిగా రైతులకు రసీదులు ఇవ్వాలని ఆదేశించారు.

డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి

అనంతపురం టౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీనివాస చిన్న పిల్లల ఆసుపత్రి అధినేత డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డిపై విచారణ జరిపి, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి సావిత్రి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఎస్పీ జగదీష్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.... శ్రీనివాస చిన్నపిల్లల ఆసుపత్రి సిబ్బంది ఆసుపత్రికి వచ్చిన పిల్లల తల్లులపై అమానుషంగా ప్రవర్తించారని, ఈ ఘటనకు సంబంధించి అన్ని చానళ్లలో ప్రసారమయ్యాయని అన్నారు. సదరు ఆసుపత్రిని సీజ్ చేయడంతోపాటు, డాక్టర్‌పై చట్టపరమైన చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రిక, నాయకులు పార్వతమ్మ, అశ్విని, గీత, శైలజ, సాయి వైష్ణవి, శారద, యశోదమ్మ పాల్గొన్నారు.

24 నుంచి మండల స్థాయి క్రీడాపోటీలు



సమావేశమైన వ్యాయామ ఉపాధ్యాయులు

చెన్నేకొత్తపల్లి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌కు సంబంధించి ఈనెల 24,25 తేదీలలో చెన్నేకొత్తపల్లి ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడాపోటీలు నిర్వహిస్తామని స్థానిక పాఠశాల పీడీ విజయనిర్మల తెలిపారు. స్థానిక ఉన్నత పాఠశాలలో మంగళవారం పోటీల నిర్వహణపై వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు.

నేటి నుంచి వనరులపై శిక్షణ

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో సొంత ఆదాయ వనరులు సమకూర్చుకోవడంపై రెండు రోజుల పాటు ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలకు శిక్షణ ఇస్తున్నట్లు జడ్పీ సీఈఓ శివశంకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల పాటు రెండు బ్యాచులుగా శిక్షణ ఏర్పాటు చేశామని వివరించారు. మొదటి బ్యాచ్‌కు 22, 23 తేదీల్లో, రెండో బ్యాచ్‌కు 24, 25 తేదీల్లో శిక్షణ ఇస్తామని తెలిపారు. జడ్పీలోని డీపీఆర్‌సీ సమావేశ భవనంలో శిక్షణ నిర్వహిస్తామని అన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు

ఆత్మకూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి బాబు, ప్రధాన అర్చకుడు రాముస్వామి పాల్గొన్నారు.

ఘనంగా రథోత్సవం

కొల్హాపురమ్మదేవికి భక్తిశ్రద్ధలతో బోనాలు



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు, బోనాలు, జ్యోతులు మోసుకెళుతున్న మహిళలు

చెన్నేకొత్తపల్లి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వెలసిన గ్రామదేవత కొల్హాపురమ్మదేవి రథోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రతిఏటా అమ్మవారి రథోత్సవాన్ని నిర్వహిస్తారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని అలంకరించి పూలరథంపై ఉంచి గ్రామంలో రథోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చి రథాన్ని లాగారు. అమ్మవారి నామస్మరణతో పుర వీధులు మారుమోగాయి. మంగళవారం జ్యోతులు, బోనాల ఉత్సవం నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున జ్యోతులు, బోనాలను పెట్టుకుని ఊరేగింపుగా వెళ్లి గ్రామ దేవతకు సమర్పించారు. ఈ సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

వడ్డె ఓబన్న విగ్రహం పాక్షికంగా ధ్వంసం



పాక్షికంగా దెబ్బతిన్న వడ్డె ఓబన్న విగ్రహం

రామగిరి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరు గ్రామంలో ఉన్న స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి ధ్వంసం చేయడానికి ప్రయత్నించారు. దాడిలో విగ్రహం పాక్షికంగా దెబ్బతింది. స్థానికులు మంగళవారం ఉదయం దీన్ని గమనించారు. దాడిపై వడ్డెర కులస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే పరిటాల సునీత దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే, ఈ ఘటనపై విచారించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డీఎస్పీ హేమంత్ కుమార్‌ను కోరారు. రామగిరి ఎస్ఐ సుధాకర్ యాదవ్ విగ్రహాన్ని పరిశీలించారు. దుండగులను గుర్తించేందుకు గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఫుటేజీని సేకరించారు.

డీఈఓ కార్యాలయానికి అసిస్టెంట్ కలెక్టర్

విద్యా పథకాలు, అమలుపై ఆరా



అసిస్టెంట్ కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న డీఈఓ

అనంతపురం విద్య, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి మంగళవారం అసిస్టెంట్ కలెక్టర్ సచిన్‌రహార్ ఆకస్మికంగా వచ్చారు. ఆయనకు డీఈఓ ప్రసాద్‌బాబు స్వాగతం పలికారు. అనంతరం విద్యాశాఖద్వారా అమలవుతున్న పథకాలు, వాటికి నిధులు, అమలు తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఎన్ని పాఠశాలలు, విద్యార్థులు, వారికి ప్రభుత్వం ద్వారా అందుతున్న పథకాల గురించి ఆరా తీశారు. ప్రధానంగా మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, తల్లికి వందనం తదితర అంశాల గురించి అడగగా.. డీఈఓ ప్రసాద్‌బాబు, ఏడీ మునీర్, ఏఎస్ఓ శ్రీనివాసులు, ఏపీఓ మంజునాథ్ వివరించారు. దాదాపు గంటపాటు డీఈఓ కార్యాలయంలో ఉండి సమాచారం సేకరించారు.

టమోటా కిలో రూ.20

అనంతపురంరూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో మంగళవారం కిలో టామోటా గరిష్టంగా రూ.20తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. మార్కెట్‌కు 1470 టన్నుల టమోటా కాయలు వచ్చాయని వివరించారు. టమోటా కిలో కనిష్ట ధర రూ.10, సరాసరి ధర రూ.14తో విక్రయాలు జరిగాయని పేర్కొన్నారు.

చీనీ టన్ను రూ.15వేలు

అనంతపురంరూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్టంగా రూ.15వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. కనిష్టంగా రూ.8వేలు, సరాసరి ధర రూ.10వేలు పలికాయని వివరించారు. మార్కెట్‌కు మొత్తంగా 34 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



కల్లుమడిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యానశాఖ అధికారులు

శింగనమల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటల సాగులో యాజయాన్య పద్ధతుల ద్వారానే అధిక దిగుబడులు సాధించవచ్చు అని ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ మాధవి తెలిపారు. మంగళవారం శింగనమల మండలంలోని కల్లుమడి రైతు సేవా కేంద్రంలో ఉద్యాన సాగుపై ఎస్సీ, ఎస్టీ రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రైతులతో కలిసి హెచ్ఓ శైలజకుమారి, శాస్త్రవేత్త మాధవి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు ఉద్యాన పంటలు సాగు చేసే సమయంలో భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయాలని తెలిపారు. పంటలు ఎదుగుదల బట్టి ఎరువులు మందులు మోతాదులలో వాడాలని రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే దిగుబడులు సాధించవచ్చు అన్నారు.

శింగనమలను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ భాస్కర్

శింగనమల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన పీ-4 కింద నియోజకవర్గ కేంద్రమైన శింగనమలను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఎంపీడీఓ భాస్కర్ తెలిపారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో పీ-4పై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. శింగనమల చెరువులో నవంబరు 2న ఎమ్మెల్యే తెప్పోత్సవాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పి-4 అధికారి బాషా, ఎంఈఓలు నరసింహరాజు, శివప్రసాద్, డిప్యూటి ఎంపీడీఓ విజయ్‌కూమార్, ఏపీఓ సౌభాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

మరవకొమ్మ వద్ద వీధి దీపాలు ఏర్పాటు చేయండి

శింగనమల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిలోని శింగనమల మరవకొమ్మ క్రాస్ వద్ద రాత్రి సమయంలో వీధిదీపాలు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని శింగనమల, శివపురం గ్రామాల ప్రజలు అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. మంగళవారం తహసీల్దార్ శేషారెడ్డి, ఎంపీడీఓ భాస్కర్‌కు శింగనమల, శివపురం గ్రామాలకు చెందిన రామ్‌చరణ్‌యాదవ్, ఆదినారాయణ, సుంకన్న, విజయ్‌కుమార్, లక్ష్మీనారాయణ వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మరవకొమ్మ క్రాస్ వద్ద విద్యుత్ దీపాలు లేవని, దీంతో రాత్రి సమయంలో అక్కడ బస్సు దిగే విద్యార్థులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న ప్రజలు

న్యూస్ బాక్స్

అందరి సహకారంతోనే అభివృద్ధి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ నాగరాగిణి

తాడిపత్రి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): అందరి సహాయ సహకారాలతోనే మార్కెట్‌యార్డు అభివృద్ధి సాధ్యమని మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ భూమా నాగరాగిణి తెలిపారు. స్థానిక మార్కెట్‌యార్డులో మంగళవారం రైతులు, ట్రేడర్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అభివృద్ధికి సలహాలు, సూచనలు ఇవ్వాలని, మార్కెట్‌యార్డులో అన్నిరకాల వసతులు కల్పిస్తున్నామని అన్నారు. ఇక్కడ గోడౌన్ రూములను రైతులు ఉపయోగించుకోవాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. మార్కెట్‌యార్డును వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లల్లో నాశనం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌యార్డు వైస్ ప్రెసిడెంట్ హరి, టీడీపీ సీనియర్ నాయకులు ఎస్వీ రవీంద్రారెడ్డి, సురేంద్రనాథ్, భూమా సూరి, శివారెడ్డి, ఆదినారాయణరెడ్డి, తిరుపాల్‌రెడ్డి జనార్దన్‌నాయుడు, మల్లికార్జునరెడ్డి, హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘర్షణకు పాల్పడితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఎస్ఐ నాగేంద్రప్రసాద్

పెద్దపప్పూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని రౌడీషీటర్లు ఎటువంటి ఘర్షణకు పాల్పడినా వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ నాగేంద్రప్రసాద్ హెచ్చరించారు. మంగళవారం ఆయన తన స్టేషన్‌లో మాట్లాడారు. వరదాయపల్లిలో ఈనెల 15న ఇరువర్గాలు ఘర్షణ పడ్డాయని, ఘర్షణలో పాల్గొన్న అదే గ్రామానికి చెందిన వెంకటేష్‌పై కేసు నమోదు చేసి.. రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

మండలంలో భారీ వర్షం

విడపనకల్లు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం ఉదయం నుంచి భారీ వర్షం కురుసింది. గడేకల్లు, విడపనకల్లు, ఆర్.కొట్టాల, కొట్టాలపల్లి, అంచనహాలు, పొలికి, గ్రామాల్లో వర్షం పడింది. గడేకల్లు, ఆర్ కొట్టాల, గ్రామాల్లో మొక్క జొన్న రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షానికి మొక్కలు తడవకుండా తర్పాలీన్‌లతో కప్పి ఉంచేందుకు నానా అవస్థలు పడ్డారు. పంటలు ఈ వర్షాలకు ఏమైతాయో అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

● బెళుగుప్ప : మండలంలోని దుద్దేకుంట, ఎర్రగుడి బెళుగుప్ప, అంకంపల్లి తదితర గ్రామాల్లో మంగళవారం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఆ గ్రామాల్లో నల్లరేగడి భూముల్లో పప్పుశెనగ విత్తనం సాగుచేశారు. విత్తనం వేసినప్పటి నుంచి చినుకుజాడలేదు. ఈ తరుణంలో మోస్తరు వర్షం కురవడంతో పప్పుశనగ రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

ఘనంగా దీపావళి

చిన్నారులతో కలిసి టపాకాయలు కాల్చిన పోలీసులు





గుంతకల్లులో విద్యార్థులతో కలిసి టపాసులు కాల్చుతున్న డీఎస్పీ, గుత్తి, కణేకల్లులో విద్యార్థులతో టపాసులను కాల్పిస్తున్న సీఐలు

గుంతకల్లుటౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలో అమృత వర్షిణి బాలకళ్యాణ ఆశ్రమంలో దీపావళి వేడుకలను పోలీసులు నిర్వహించారు. డీఎస్పీ శ్రీనివాస్, వన్‌టౌన్, టూటౌన్ సీఐలు మనోహర్, ఏపీ మస్తాన్, ఎస్ఐలు టీపీ వెంకటస్వామి, రాఘవేంద్రప్ప విద్యార్థుల తో కలసి టపాసులు కాల్చారు. అనంతరం ఆశ్రమానికి రూ. 20వేలు విరాళంగా అందజేశారు.

● గుత్తి : స్థానిక కొత్తురు కాలనీలో స్వీట్ సెవీయర్ మెమోరియల్ ట్రస్ట్ అనాథ ఆశ్రమంలో సీఐ రామారావు, ఎస్ఐ సురేష్, ఏఎస్ఐ మాణిక్యం, సిబ్బంది హనమంతు పిల్లలతో దీపావళి వేడుకను నిర్వహించారు.

● కణేకల్లు : కణేకల్లు క్రాసింగ్‌లో ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బుద్ధిమాంద్యం స్కూల్‌లో రాయదుర్గంరూరల్ సీఐ వెంకటరమణ, కణేకల్లు ఎస్ఐ నాగమధు,సిబ్బంది దీపావళి నిర్వహించారు. అందులోని 150 మంది విద్యార్థులతో కలిసి టపాకాయలు కాల్చారు.

● తాడిపత్రి: పట్టణంలోని నందలపాడులో ఉన్న విశ్వహిందూ పరిషత్ సౌభాగ్య సింధు అనాథ శరణాలయంలో సోమవారం సీఐ ఆరోహణరావు, ఎస్ఐ గౌస్‌బాషా పిల్లలతో కలిసి దీపావళి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.



తాడిపత్రి: టపాసులు అందజేస్తున్న సీఐ



ఉరవకొండ : మానవహారంగా ఏర్పడ్డ పోలీసులు, విద్యార్థులు

పోలీసు అమరవీరులకు నివాళి

ఉరవకొండ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా పట్టణంలో పోలీసులు, విద్యార్థులు మంగళవారం నివాళులర్పించారు. మొదట స్థానిక పోలీసు స్టేషన్ నుంచి విద్యార్థులతో కలిసి టవర్‌క్లాక్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు. అలాగే వజ్రకరూరులో పోలీసు అమరవీరుల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో సీఐ మహానంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో గొర్రెలు మృతి

కణేకల్లు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి వాసి కురుబ నాగరాజుకు చెందిన రెండు గొర్రెలు విద్యుత్‌షాక్‌తో మరణించాయి. మంగళవారం గ్రామ సమీపంలో అవి మేత మేస్తుండగా.. విద్యుత్ స్తంభం వద్ద అర్త్ వైరుకు తగిలి.. విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మరణించాయి. వీటి విలువ దాదాపు రూ. 30 వేలు ఉన్నట్లు బాధితుడు వాపోయాడు.

వైద్యులకు షోకాజ్ నోటీసులు

గుత్తి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలోని ముగ్గురు వైద్యులు విధులను నిర్లక్ష్యం చేశారని ఆసుపత్రి వైద్యాధికారి ఎల్లప్ప మంగళవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వైద్యులు రొటేషన్ పద్ధతిలో విధులు నిర్వహించాల్సి ఉండగా మంగళవారం ఎలాంటి సమాచారం ఇవ్వకుండా విధులకు వారు గైర్హాజర్ అయ్యారని, దీంతో సివిల్ అసిస్టెంట్ సర్జన్ పవిత్ర, వైద్యులు రమ్యశ్రీ, రాజేష్‌కు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు.

పరిహారం ఆలయ అభివృద్ధికి ఇవ్వండి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్థులు

యాడికి, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): రాయలచెరువు గ్రామంలోని చెరువులో ఏర్పాటు చేసిన హైటెన్షన్ టవర్ల ఏర్పాటుకు ఇచ్చే పరిహారాన్ని గ్రామంలోని చెన్నకేశవస్వామి ఆలయ అభివృద్ధికి అందించేలా చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామస్థులు తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. టవర్ల ఏర్పాటు కోసం అందించే పరిహారాన్ని నిర్మాణంలో ఉన్న చెన్నకేశవస్వామి ఆలయానికి అందించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రామానాయుడు, శోభన్‌బాబు, తలారి శివ, రాజశేఖర్, వెంకటనారాయణ, రవికిరణ్, రంగనాథ్‌చౌదరి ఉన్నారు.

బీటీపీ కాలువ పనుల పరిశీలన



కాలువ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోరంపల్లి వద్ద జరుగుతున్న బీటీపీ కాలువ పనులను ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, టీడీపీ నాయకుడు రాజగోపాల్ మంగళవారం పరిశీలించారు. నియోజకవర్గంలో ఇప్పటికే మూడు చోట్ల కాలువ పనులు శరవేగంగా సాగుతున్నాయని ఇంజినీర్లు వారికి వివరించారు. కుందుర్పి మండలం బ్రాంచ్ కెనాల్, బ్రహ్మసముద్రం మండలం సమీపంలోని వెస్ట్ కోడిపల్లి, కళ్యాణదుర్గం మండలం బోరంపల్లి నుంచి దుద్దేకుంట ప్రాంతాల్లో పనులు కొనసాగుతున్నాయన్నారు. జాప్యం లేకుండా కాలువ పనులన్నీ వేగవంతంగా చేయాలని వారు ఇంజనీర్లకు సూచించారు.

● 8న కనకదాసు విగ్రహాన్ని ఆవిష్కరిద్దాం

కళ్యాణదుర్గం : కనకదాసు జయంతి సందర్భంగా నెల 8న పట్టణంలో కొత్తగా ఏర్పాటు చేసిన కనకదాసు విగ్రహాన్ని ఆవిష్కరిద్దామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. మంగళవారం స్థానిక ప్రజావేదికలో తాలూకా కురుబ సంఘం నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు మంత్రి నారాలోకేశ్‌ను ఆహ్వానిద్దామని, కనకదాసు సర్కిల్ బస్టాప్‌గా నామకరణం చేద్దామని అన్నారు. కార్యక్రమంలో తాలూకా కురుబ సంఘం నాయకులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

బొమ్మనహాళ్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్గాహొన్నూరు గ్రామ శివారులో పేకాట ఆడుతున్న 13 మందిని సోమవారం అరెస్ట్ చేసినట్లు బొమ్మనహాళ్ ఎస్ఐ నబిరసూల్ తెలిపారు. వారి నుంచి రూ. 24,300 నగదు, నాలుగు బైక్‌లు స్వాధీనం చేసుకున్నామని, వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారన్నారు.

● తాడిపత్రి: స్థానిక సంజీవనగర్‌లో పది మంది పేకాటరాయుళ్లను మంగళవారం అరెస్ట్ చేశామని, వారివద్ద నుంచి రూ.15,100 స్వాధీనం చేసుకున్నామని పట్టణ సీఐ ఆరోహణరావు తెలిపారు. వారిపై కేసు నమోదు చేశామన్నారు.

వైభవంగా ధన్వంతరి జయంతి

కళ్యాణదుర్గం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక త్యాగరాజు స్వామి మందిరంలో నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ధన్వంతరి జయంతి ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు మల్లికార్జునస్వామి, యోగానంద, మోహన్ ప్రకాష్, పట్టణ అధ్యక్షుడు రవి, సంక్షేమ సంఘం రాయలసీమ కన్వీనర్ ధనంజయ, నాయకులు పాల్గొన్నారు.



ఉత్సవాల్లో పాల్గొన్న సంఘం నాయకులు

పాముకాటుతో గొర్రెల కాపరి మృతి



వన్నూరుస్వామి (ఫైల్)

కణేకల్లు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాల్యం గ్రామ వాసి, గొర్రెలకాపరి కురుబ వన్నూరుస్వామి(39) పాముకాటుతో సోమవారం మరణించాడు. అతను తన గొర్రెలతో ఇటీవల వజ్రకరూరు మండలం కోనాపురం వద్దకు మేతకు వెళ్లాడు. ఆ సమయంలో పాము ఆయన్ను కాటేసింది. చికిత్స కోసం అనంతపురం తరలించారు. కోలుకోలేక ఆయన సోమవారం మరణించాడు. ఆయన భార్య నీలమ్మ, కుమారులు శ్రీకాంత్, నవీన్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..



హనుమంతు (ఫైల్)

కూడేరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముద్దులాపురం గ్రామానికి చెందిన జెన్నే హనుమంతు (60) రోడ్డు ప్రమాదంలో మరణించాడు. అతను మంగళవారం రాత్రి ఆ గ్రామంలో అంగడికి వెళ్తుండగా.. వేగంగా వచ్చిన గుర్తు తెలియని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మరణించాడు. సీఐ రాజు, ఏఎస్ఐ రామానాయుడు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేపట్టారు.

రైల్లో నుంచి పడి గాయాలు

గుత్తి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా పత్తికొండకు చెందిన వీరేష్ బెంగళూరు నుంచి గుత్తికి రైలులో బయలుదేరాడు. మంగళవారం తెల్లవారుజామున నిద్ర లేవగా.. రైలు గుత్తి రైల్వేస్టేషన్‌లో నుంచి బయలుదేరుతుండటాన్ని గమనించి.. వెంటనే కదిలే రైలు నుంచి దిగడానికి యత్నించాడు. కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. రైల్వే పోలీసులు అతన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

విద్యుత్ తీగ తెగిపడి..

పెద్దవడుగూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపురాజుపల్లి గ్రామంలో గృహాల మీద వెళ్లిన విద్యుత్‌తీగ ఒక్కసారిగా తెగి కిందపడడంతో మంగళవారం మంటలు వ్యాపించాయి. అటుగా వెళుతున్న నందినికి స్వల్పగాయాలు అయ్యాయి. స్థానికుల సమాచారంతో విద్యుత్‌శాఖ అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది.

బైక్ ఢీకొని...

గుమ్మఘట్ట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోనబావి గ్రామానికి చెందిన మహిళా కూలీ కురుబ తిప్పక్క ద్విచక్రవాహనం ఢీ కొని కాలికి తీవ్ర గాయాలయ్యాయి. తిప్పక్క సోమవారం కూలీ పనుల కోసం రాయదుర్గం పట్టణం శివారు ప్రాంతానికి వెళ్లి .. తిరిగి స్వగ్రామానికి చేరుకునేందుకు ప్రధాన రహదారిపై వేచి ఉంది. ఆ సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్రవాహనంపై వేగంగా వచ్చి.. తిప్పక్కను ఢీ కొట్టాడు. ఆమె కాలుకు తీవ్రగాయాలు కాగా స్థానికులు రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గుమ్మఘట్ట పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఆటో బోల్తా పడి..

గుత్తిరూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని జక్కలచెరువు గ్రామాశివారులో సోమవారం ఓ ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గుత్తి ఆర్ఎస్‌కు చెందిన రజిని తీవ్రంగా గాయపడగా.. ఆమెను స్థానికులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఇరువర్గాల ఘర్షణలో...

గుత్తి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెర్లోపల్లి కాలనీలో పావురాల విషయమై వెంకటరమణ, ఓబులేసు వర్గాలు మంగళవారం గొడవపడ్డాయి. వెంకటరమణ, ఓబులేసు గాయపడ్డారు. వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇరువర్గీయులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వ్యక్తిపై దాడి

తాడిపత్రి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన అనిల్‌పై కుమార్ మరో ముగ్గురు కలిసి దాడిచేశారు. పాతకక్షల కారణంగా మాటమాట పెరిగి ఘర్షణకు దిగారు. ఈ దాడిలో కుమార్ గాయపడ్డాడు. కేసు దర్యాప్తులో ఉన్నట్లు పట్టణ ఎస్ఐ గౌస్‌బాషా తెలిపారు.

బాణసంచా విక్రేతలపై కేసులు

యాడికి, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): యాడికి, రాయలచెరువు గ్రామాల్లోని బాణాసంచా విక్రయ దుకాణాలపై సోమవారం తూనికలు, కొలతలశాఖ అధికారులు దాడులు చేశారు. ఏడు దుకాణాలపై కేసులు నమోదుచేశారు. యాడికిలోని ఐదు, రాయలచెరువులోని రెండు దుకాణాల్లో నిబంధనలకు విరుద్ధంగా బాణాసంచా విక్రయిస్తున్నట్లు గుర్తించి కేసులు నమోదు చేసినట్లు తూనికలు, కొలతలశాఖ గుంతకల్లు అధికారి వైజీ శంకర్ తెలిపారు.

200 చింతచెట్ల నరికివేత

కళ్యాణదుర్గం రూరల్, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరులోని ప్రభుత్వ భూమిలో ఉన్న 200 చింత చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం నరికివేశారు. నాలుగు సంవత్సరాల క్రితం గ్రామాభివృద్ధి కోసం ఈ చింత చెట్లను నాటారు. ఆ చింతచెట్లను నరికివేయడంపై గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రెండిళ్లలో చోరీ

గుమ్మఘట్ట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోనబావిలో సోమవారం రాత్రి వడ్డే మారెన్న, చౌడప్ప ఇళ్లలో దుండగులు చోరీకి పాల్పడ్డారు. వీరు తమ కుటుంబాలతో కలిసి ఉపాధి కోసం వలస వెళ్లారు. దుండగులు మారెన్న ఇంట్లో మూడుతులాలు, చౌడప్ప ఇంట్లో రెండుతులాల బంగార ఆభరణాలను ఎత్తుకెళ్లారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

డివిజనల్ స్థాయి పోటీలకు ఎంపిక

ఉరవకొండ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలను స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో మంగళవారం నిర్వహించారు. బాడ్మింటన్, యోగా, ఖో-ఖో, కబాడ్డీ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులను డివిజనల్ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఎంపీడీఓ రవిప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ ఈశ్వరయ్య, హెచ్ఎం సత్యనారాయణ, వ్యాయామ ఉపాధ్యాయులు మారుతి ప్రసాద్, రాఘవేంద్ర పాల్గొన్నారు.

● బెళుగుప్ప : స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 17 విభాగం వాలీబాల్ పోటీలు మంగళవారం నిర్వహించారు. 11 మండలాల నుంచి 22 జట్లు ఈ పోటీలో పాల్గొన్నాయి. బెళుగుప్ప బాలు ర జట్టు, శెట్టూరు బాలికల జట్టు ప్రథమ స్థానంలో నిలిచినట్లు పీడీ గోపాల్‌రెడ్డి తెలిపారు. డీవైఈఓ మల్లారెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున, హరికృష్ణ, ఎంఈఓ 2 హరికృష్ణ, హెచ్ఎం వెంకట ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థినులకు టైలరింగ్ శిక్షణ

గుంతకల్లుటౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ శంకరా నందగిరిస్వామి డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు 45 రోజులు పాటు టైలరింగ్‌పై శిక్షణ ఇచ్చి, సర్టిఫికెట్లను అందజేస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కే వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. విద్యార్థినులు ఈ శిక్షణను మంగళవారం ప్రారంభించిన ఆయన దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మహిళా సాధికారత విభాగం కన్వీనర్ వెంకటసుబ్బమ్మ, సభ్యులు శ్రావణి, షైమూన్, సుభాషిణి, భారతి, సువర్ణదేవి, సౌజన్య వైశాలి, వరలక్ష్మి, అధ్యాపకుడు బసెట్టి క్రిష్ణయ్య పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలపై హర్షం

రాయదుర్గంరూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రాయదుర్గం పురపాలక సంఘంలో విధులు నిర్వహిస్తూ లోక్‌నాథ్‌రెడ్డి, రామాంజినేయులు అనే కార్మికులు రెండున్నర సంవత్సరాలుగా క్రితం మరణించారు. వారి భార్యలకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు ఇవ్వాలని సీఐటీయూ నాయకులు నాటి నుంచి పోరాటాలు చేశారు. ఎట్టకేలకు వారికి ఉద్యోగాలు వచ్చాయి. వారికి ఆర్డర్ కాపీలను మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్ మంగళవారం అందజేశారు. దీంతో వారితో పాటు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులుకు కార్మికులు ధన్యవాదాలు తెలిపారు.

రైల్వే మోరీ కింద మురుగు నిల్వ

ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్న స్థానికులు

గుంతకల్లుటౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక గుంతబావి సమీపంలోని రైల్వే మోరీ కింద మోకాళ్లలోతు మురుగు నీరు నిల్వ ఉంటోంది. దీంతో ద్విచక్రవాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ మురుగునీటిలో ద్విచక్రవాహనాలు ఆగిపోతుండటంతో వాటిని తోసుకుంటూ రావాల్సిన దుస్థితి ఉంది. అనేక సంవత్సరాలుగా స్థానికులు ఈ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. ఆ సమస్య పరిష్కరించాలని ప్రజాప్రతినిధులు, అధికారులను విజ్ఞప్తి చేసినా పట్టించుకునేవారే కరువయ్యారని వాపోతున్నారు. చిన్న పాటి వాన వచ్చినా ఈ మోరీ కింద పెద్ద ఎత్తున మురుగు ప్రవహిస్తూ ఉంటుందని, ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కోరుతున్నారు.



మురుగునీటిలో ఆగిపోయిన బైక్

పొంచివున్న ప్రమాదం



కూడేరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ కార్యాలయం ఎదురుగా ఉన్న 33 కెవీ లైన్ ఇనుప స్తంభానికి ఇలా భారీగా పిచ్చి తీగలు అల్లుకున్నాయి. ఇటీవల వర్షాలు పడుతుండటంతో ఎప్పుడు .. ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షం పడినప్పుడు ఆ తీగల ద్వారా విద్యుత్ ప్రవహిస్తే.. ఘోర ప్రమాదం జరిగే అవకాశముంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి.. ఆ పిచ్చితీగలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కార్పొరేట్ సెలూన్ షాపులు తొలగించాలి



దీక్షల్లో మాట్లాడుతున్న నల్లప్ప

గుంతకల్లుటౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కార్పొరేట్ సెలూన్ షాపులు తొలగించాలని స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద క్షవర వృతిదారుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రిలే దీక్షలు ప్రారంభించారు. ఆ సంఘం జిల్లా కార్యదర్శి బీ శ్రీనివాసులు మాట్లాడుతూ.. సాంప్రదాయ మంగళి వృత్తిదారుల ఉపాధిని కాపాడాలని 45 రోజులుగా వివిధ రూపాల్లో అనేక నిరసన కార్యక్రమాలను చేపట్టినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదన్నారు. ఈ దీక్షలకు సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఓ నల్లప్ప, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ నైరుతిరెడ్డి, రజక సంఘం నాయకుడు దేవేంద్రప్ప సంఘీభావం తెలిపారు.

కల్తీ పెట్రోల్ విక్రయించారని ఆందోళన



పెట్రోల్‌ను పరిశీలిస్తున్న ఎస్ఐ, రెవెన్యూ అధికారులు

గుత్తి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీ సర్కిల్ సమీపంలో ఉన్న ఓ పెట్రోల్ బంక్‌లో పెట్రోల్ కల్తీ చేసి విక్రయిస్తున్నారని గుంతకల్లు రోడ్డులోని పిండిమిషన్ యజమాని చంద్రశేఖర్ మంగళవారం ఆందోళన చేశాడు. ఓ బాటిల్‌లో పెట్రోల్ పోయించుకోగా.. పెట్రోల్ తెల్లగా ఉండటంతో కల్తీ చేశారంటూ ఆ బంక్ నిర్వాహకులతో వాగ్వివాదం దిగాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ సురేష్, డిప్యూటీ తహసీల్దార్ సూర్యనారాయణ, సీఎస్‌డీటీ ప్రవీణ్ కుమార్ ఆ బంక్‌లో పెట్రోల్‌ను పరిశీలించారు. పెట్రోల్ శాంపిల్‌ను తీసుకుని ప్రయోగశాలకు పంపారు.

కవి విద్వాన్ విశ్వం జయంతి

గుంతకల్లుటౌన్, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో కవి విద్వాన్ విశ్వం జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. జాతీయస్థాయి కథల పోటీల్లో మూడుసార్లు ప్రతిభ చూపిన ఆ పాఠశాల పదో తరగతి విద్యార్థిని జోత్స్నను భారతి సాహితీ సమితి ఆధ్వర్యంలో సన్మానించారు. ఇందులో ఆ సమితి అధ్యక్ష, కార్యదర్శులు ఈఓ రాముడు, గంగరాజు, పాఠశాల హెచ్ఎం నారాయణ రెడ్డి, తెలుగు ఉపాధ్యాయుడు చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సత్యసాయిబాబా రథోత్సవం

ఉరవకొండ, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా అవతార ప్రకటన వేడుకలను పట్టణంలో సోమవారం నిర్వహించారు. బాలసత్యసాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక వాహనంలో సత్యసాయిబాబా చిత్రపటాన్ని పురవీధుల్లో ఊరేగించారు.

కూలిన మిద్దె

కుందుర్పి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎనుములదొడ్డిలో సోమవారం కురిసిన వర్షానికి మల్లేశప్పకు చెందిన మిద్దె కూలింది. ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి నిద్రిస్తుండగా.. మరొ గది పైకప్పు కూలింది. వారు వెంటనే బయటకు వచ్చారు. ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి ప్రమాదమూ జరగలేదు.